# బీఆర్‌ఎస్‌కే విజయావకాశాలు

◆ ఎమ్మెల్యే బీరం గెలుపు తథ్యమంటున్న గులాబీ శ్రేణులు ◆ బ్యాలెట్ బాక్సుల్లో అభ్యర్థుల భవితవ్యం

పెద్దకొత్తపల్లి/ పెంట్లవెల్లి, డిసెంబర్ 2: సీఎం కేసీఆర్ చేపట్టిన సంక్షేమ పథకాలు, కొల్లాపూర్ నియోజకవర్గంలో ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్ రెడ్డి చేపట్టిన అభివృద్ధి పనులే ఎన్నికల్లో ప్రజలు ఓట్లు వేశారని, దీంతో గెలుపు తథ్యమని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు గణేశ్‌రావు తెలిపారు. కాంగ్రెస్ నాయకులు గ్రామాల్లో ఓటర్లకు ఎన్ని మాయమాటలు చెప్పినా ఓటర్లు కారు గుర్తుకు ఓటు వేశారని పేర్కొన్నారు. పెద్దకొత్తపల్లి మండలంలో గతంలో చేసిన అభివృద్ధిని నాయకులు గ్రామాల్లో విస్తరించారని ఐదేండ్లలో ఎమ్మెల్యే బీరం, సీఎం కేసీఆర్‌తో ప్రత్యేక నిధులు మంజూరు చేయించి అభివృద్ధి చేశారని అన్నారు. అనారోగ్యానికి గురైన కుటుంబాలకు గతంలో ఎన్నడూ లేని విధంగా వైద్యాన్ని అందించి, ఆదుకున్న నాయకుడు ఎమ్మెల్యే బీరం అన్నారు. ఎవరెన్ని కుట్రలు, కుతంత్రాలు చేసినా కొల్లాపూర్ నియోజకవర్గంలోని అన్ని గ్రామాల్లో ఓటర్లు అత్యధికంగా కారు గుర్తుకు ఓటు వేసి గెలిపిస్తున్నారని ధీమా వ్యక్తం చేశారు. మరోసారి ఎమ్మెల్యే బీరం హ్యాట్రిక్ కొట్టడం ఖాయమన్నారు.



పెంట్లవెల్లిలో అభయాంజనేయ స్వామి ఆలయంలో పూజలు చేస్తున్న బీఆర్ఎస్ మహిళా అభిమానులు

**అభయాంజనేయుడికి ఘనంగా పూజలు**

అసెంబ్లీ ఎన్నికల ఫలితాల్లో కొల్లాపూర్ నియోజకవర్గంలో బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి బీరం హర్షవర్ధన్‌రెడ్డి విజయం సాధించాలని, అదేవిధంగా కేసీఆర్ సీఎం కావాలని కోరుతూ.. పెంట్లవెల్లి మండల కేంద్రం సమీపంలోని బసవయ్య తోటలో వెలసిన అభయాంజనేయ స్వామి ఆలయంలో శనివారం మండల కేంద్రానికి చెందిన బీఆర్ఎస్ కార్యకర్తలు స్వామి వారికి విశేష పూజాకార్యక్రమాలు నిర్వహించారు. ఈసందర్భంగా బీరం అభిమానులు శేషేంద్రప్రసాద్, రాజు, శివశంకర్‌చారి, గోపితో పాటు మహిళా కార్యకర్తలు ఆంజనేయస్వామికి మహాగణపతి పూజ, పంచామృత అభిషేకాలు, సిందూర లేపనం, ఆకుపూజ కార్యక్రమాలు నిర్వహించారు.

## పాసుల కోసం కార్యాలయం వద్ద ఏజెంట్ల సందడి

కొల్లాపూర్, డిసెంబర్ 2: ఆదివారం కొల్లాపూర్ అసెంబ్లీ ఎన్నికల ఓట్ల లెక్కింపు కోసం ఎన్నికల బరిలో ఉన్న వివిధ రాజకీయ పార్టీల అభ్యర్థుల తరపున ఏజెంట్లు పాసుల కోసం రావడంతో శనివారం కొల్లాపూర్ తాసీల్దార్ కార్యాలయం వద్ద సందడి కనిపించింది. కొల్లాపూర్ అసెంబ్లీ ఎన్నికల బరిలో ఉన్న మొత్తం 14మంది అభ్యర్థుల తరపున నాగర్‌కర్నూల్ సమీపంలో ఉన్న నెల్లికొండ రోడ్డులో ఉన్న వ్యవసాయ గోడౌన్‌లో ఓట్ల లెక్కింపు కోసం కావాల్సిన పాస్‌ల కోసం ఆయా పార్టీల ఏజెంట్లు స్థానిక ఎన్నికల రిటర్నింగ్ అధికారి, జిల్లా అదనపు కలెక్టర్ కుమార్‌దీపక్ సంతకాల కోసం కార్యాలయానికి తరలివచ్చారు. ఆదివారం ఉదయం 8గంటలకు ఓట్ల లెక్కింపు ప్రక్రియ మొదలుకానున్నది.

## 'విలువలతో కూడిన విద్య'పై తరగతులు



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న హెచ్‌ఎం శోభారాణి

కొల్లాపూర్, డిసెంబర్ 2: సత్యసాయి సేవా సంస్థ తెలంగాణ వారి ఆదేశానుసారం పట్టణంలోని జిల్లా పరిషత్ గాంధీ స్మారకోన్నత పాఠశాలలో విద్యార్థులకు గంట పాటు విలువలతో కూడిన విద్య అనే అంశంపై తరగతులు నిర్వహించారు. ప్రతి నెల మొదటి, మూడో శనివారం రాష్ట్ర వ్యాప్తంగా ఎంపిక చేసిన 145 ఉన్నత పాఠశాలలో ఈ కార్యక్రమం చేపడుతున్నారు. ఆరోగ్య విద్య అనే అంశం పై తరగతులను ప్రారంభించారు. ఈ విషయాన్ని ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు, కొల్లాపూర్ సత్యసాయి సేవా సమితి సభ్యురాలు బంగారు శోభారాణి తెలిపారు. కార్యక్రమంలో సమితి కన్వీనర్ నీలం రెడ్డి, వెంకటేశ్వర్‌రావు, వెంకటయ్య పాల్గొన్నారు.

## 84శాతం పోలింగ్ నమోదు

వీపనగండ్ల, డిసెంబర్ 2: నవంబర్ 30న నిర్వహించిన అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా మండలంలో 28 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. మొత్తం 22,753ఓటర్లకుగాను 19,125మంది ఓటు హక్కును వినియోగించుకొన్నారు. 84శాతం పోలింగ్ నమోదైనట్లు తాసీల్దార్ వరలక్ష్మి తెలిపారు. గ్రామాల వారీగా వీపనగండ్లలో 3,714మంది ఓటర్లకుగాను 3,004 మంది, గోవర్ధనగిరిలో 1,720 మంది ఓటర్లకుగాను 1,506 మంది, సంగినేనిపల్లిలో 2,548 మంది ఓటర్లకుగాను 2,211మంది, నాగర్లబండ తండా గ్రామ పంచాయతీలో 347మంది ఓటర్లకుగాను 303 మంది, తూంకుంటలో 2,747 మంది ఓటర్లకుగాను 2,026 మంది, సంపత్‌రావుపల్లిలో 851 మంది ఓటర్లకుగాను 768 మంది, రంగవరంలో 344మంది ఓటర్లకుగాను 316మంది, గోపల్‌దిన్నె 1,463 మంది ఓటర్లకుగాను 1,224 మంది, పులగర్‌చర్ల 1,624 మంది ఓటర్లకుగాను 1,441 మంది, కల్వరాల 3,407 మంది ఓటర్లకుగాను 2,838 మంది, బొల్లారం 2,416 మంది ఓటర్లకుగాను 2,039 మంది, కొర్లకుంటలో 440 మంది ఓటర్లకుగాను 382 మంది, వల్లభాపురం 1,132 మంది ఓటర్లకుగాను 969 మంది ఓటు హక్కును వినియోగించుకొన్నారు.

## ఆయిల్‌పాం సాగుకు దరఖాస్తుల ఆహ్వానం

కొల్లాపూర్, డిసెంబర్ 2: 2023-24 ఏడాది రబీ సీజన్‌లో ఆయిల్‌పాం సాగు కోసం దరఖాస్తులు ఆహ్వానించినట్లు కొల్లాపూర్ డివిజన్ ఉద్యానవనశాఖ అధికారి లక్ష్మణ్ శనివారం ప్రకటనలో తెలిపారు. ఆయిల్‌పాం సాగు చేయదలచుకున్న రైతులు తమ ధ్రువీకరణపత్రాలను ఉద్యాన శాఖ కార్యాలయంలో సమర్పించాలని, పట్టాదారు పాస్‌బుక్, ఆధార్‌కార్డు, బ్యాంక్ అకౌంట్‌బుక్ జిరాక్స్, పాస్‌ఫొటో జతపరచాలని తెలిపారు.

## సైబర్ నేరాలపై అవగాహన

కొల్లాపూర్, డిసెంబర్ 2: మహిళలపై గృహహింస, వరకట్న వేధింపులు, లైంగిక వేధింపులు, సైబర్ నేరాలపై శనివారం మండల పరిషత్ కార్యాలయంలో అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలకు అవగాహన కల్పించారు. అంతర్జాతీయ మహిళల హింస వ్యతిరేక దినోత్సవం, సఖి కేంద్రం సేవలపై కార్యక్రమంలో సీడీపీవో వెంకటరమణమ్మ వివరించారు. సఖి కేంద్రం ఎల్లప్పుడూ పనిచేస్తుందని, ఈ కార్యాలయం ద్వారా కౌన్సెలింగ్, పోలీస్ సహాయం, న్యాయ సలహాలు, వైద్య సేవలు, అవసరమున్న బాధితులకు ఐదు రోజుల్లో తాత్కాలిక వసతి, బాధిత మహిళల వివరాలు గోప్యం ఉంచుతామని పేర్కొన్నారు. జిల్లాలో హింసకు గురవుతున్న బాధిత మహిళలు ఉంటే ఈ టోల్ ఫ్రీ నెంబర్ 181, సఖి ఆఫీస్ నెంబర్ 99519 40181 సంప్రదించాలని తెలిపారు.

# 8గంటల నుంచి ఓట్ల లెక్కింపు

- మీడియా సమావేశంలో అదనపు కలెక్టర్, కొల్లాపూర్ ఈఆర్వో వెల్లడి

కొల్లాపూర్, డిసెంబర్ 2: భారత ఎన్నికల సంఘం న్యూఢిల్లీ జారీ చేసిన నోటిఫికేషన్ ప్రకారం, 85 కొల్లాపూర్ అసెంబ్లీ నియోజకవర్గంలో గురువారం ఎన్నికల పోలింగ్ ప్రక్రియ జరుగగా, నాగర్‌కర్నూల్ సమీపంలో నెల్లికొండ వ్యవసాయ మార్కెట్ గోడౌన్‌లో ఆదివారం ఉదయం 8గంటల నుంచి ఓట్ల లెక్కింపు కార్యక్రమాన్ని చేపట్టనున్నట్లు జిల్లా అదనపు కలెక్టర్, కొల్లాపూర్ ఈఆర్వో కుమార్‌దీపక్ తెలిపారు. శనివారం ఆయన ఇక్కడి ఆర్వో కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. ఉదయం 8 గంటలకు పోస్టల్ బ్యాలెట్ ఓట్ల లెక్కింపు ఉంటుందని తెలిపారు. నియోజకవర్గంలో మొత్తం 2,34,167 ఓట్లకు గాను 1,90,669 ఓట్లు పోల్‌కాగా 81.12శాతం (పోస్టల్ బ్యాలెట్ ఓట్లు కాకుండా) పోలింగ్ నమోదైంది. ఎన్నికల విధుల పై డ్రాఫ్ట్ చేసిన వ్యక్తుల కోసం రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ఓటర్ ఫెసిలిటేషన్ కేంద్రాల నుంచి మొత్తం పోస్టల్ బ్యాలెట్ ఓట్లు 1,835గాను 1,678 వచ్చాయని తెలిపారు. పరిశీలకుడు, పోటీలో ఉన్న అభ్యర్థులు, ఎన్నికల ఏజెంట్లు ఉదయం 7:30 గంటల వరకు చేరుకోవాలని కోరారు. కమిషన్ సూచనల మేరకు ముందుగా పోస్టల్ బ్యాలెట్ లెక్కింపు చేపడతామన్నారు. పోస్టల్ బ్యాలెట్ కౌంటింగ్ కోసం మొత్తం



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్, ఈఆర్వో దీపక్‌కుమార్

రెండు టేబుల్స్ ఏర్పాటు చేశారని తెలిపారు. కమిషన్ ఆమోదంతో మొత్తం 14 టేబుల్స్ ఏర్పాటు చేయగా, ఉదయం 8:30 నుంచి ఈవీఎంల లెక్కింపు ప్రక్రియ మొదలవుతుందన్నారు. మొత్తం 269 పోలింగ్ కేంద్రాలకుగాను మొత్తం 14 టేబుల్స్‌లో మొత్తం 20రౌండ్లు ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా రెండింటికీ 150 సిటింగ్ సామర్థ్యంతో ప్రత్యేక హాల్ ఏర్పాటు చేసినట్లు అదనపు కలెక్టర్, ఈఆర్వో కుమార్‌దీపక్ పేర్కొన్నారు. ఈ హాల్‌లో మైక్‌సెట్, స్క్రీన్‌తో రౌండ్లవారీగా ఫలితాన్ని ప్రసారం చేయడానికి నేరుగా ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు.

# ఘనంగాగోదా దేవి కల్యాణం

పెద్దకొత్తపల్లి, డిసెంబర్ 2: మండల పరిధిలోని దేవుని తిరుమలాపురంలో గల వేంకటేశ్వర ఆలయంలో కార్తీకమాసం సందర్భంగా గోదాదేవి కల్యాణం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వేద పండితులు పార్వతీ పరమేశ్వరులకు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం గ్రామంలో దేవతామూర్తులను ఊరేగించారు. భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ సందర్భంగా అన్నదాన కార్యక్రమం చేపట్టారు. కార్తీక మాసం సందర్భంగా మహిళలు పెద్దఎత్తున దీపోత్సవం నిర్వహించారు.



గోదా కల్యాణం నిర్వహిస్తున్న వేద పండితులు

## వ్యాధి నిరోధక టీకాలు వేయించాలి



బండపల్లిలో బాలింతలకు ఆరోగ్యంపై అవగాహన కల్పిస్తున్న అధికారి రామయ్య

పాన్‌గల్,డిసెంబర్ 2: చిన్నారులకు వ్యాధినిరోధక టీకాలు క్రమం తప్పకుండా వేయించాలని కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ రామయ్య, ఆరోగ్య విస్తరణాధికారి శ్రీనివాస్ అన్నారు. శనివారం మండలంలోని బండపల్లిలో వారు బాలింతలకు ఆరోగ్యంపై అవగాహన కల్పించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ అప్పుడే బిడ్డలకు తల్లిపాలు తాపించాలని, పరిసరాలతో పాటు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని కోరారు. తాత్కాలిక కుటుంబనియంత్రణ పద్ధతులు అవలంబించాలని కోరారు. బాలింతలు పౌష్టికాహారం తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో వైద్యసిబ్బంది రమాదేవి, శైలజ, విజయ ఉన్నారు.

## కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం విక్రయించాలి

పాన్‌గల్, డిసెంబర్ 2: ప్రభుత్వం ఏర్పాటు చేసిన వరి కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం విక్రయించాలని సింగిల్ విండో కార్యనిర్వాహక అధికారి భాస్కర్‌గౌడ్ సూచించారు. శనివారం మండల కేంద్రంతోపాటు మాందాపూర్, దవాజీపల్లి గ్రామాల్లోని వరి కొనుగోలు కేంద్రాలను పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతుల సంక్షేమం దృష్ట్యా ప్రభుత్వం క్వింటాకు రూ.2,203లు మద్దతు ధర చెల్లిస్తామన్నారు. రైతులు ప్రైవేట్ వ్యక్తులను ఆశ్రయించి మోసపోవద్దని సూచించారు. విండో సిబ్బంది, రైతులు ఉన్నారు.